బుధవారం 14-8-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 424, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD



మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com


## కేజ్రీవాల్, కవిత జ్యుడిషియల్ కస్టడీ పొడిగింపు

### ఢిల్లీ కోర్టు ఆదేశాలు జారీ





ముందడుగు జాతీయం:

ఢిల్లీ మద్యం విధానం కేసులో అరెస్ట్ అయినా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు పొడిగించింది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై అరెస్టయి ప్రస్తుతం తిహాడ్ జైలులో ఉంటున్న ఈ నేతలిద్దరి కస్టడీని సెప్టెంబర్ 2వరకు పొడిగించింది. గతంలో విధించిన జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో వీరిని దిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి కావేరి బవేజా ఎదుట వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు హాజరు పరిచారు. ఈ నేపథ్యంలో జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు.

## వైద్యురాలి అత్యాచార కేసు సిబిఐకి

### కలకత్తా హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ




ముందడుగు పశ్చిమబెంగాల్:

పశ్చిమబెంగాల్ కోల్‌కతాలోని వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై కలకత్తా హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. కేసు దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి బదిలీ చేయాలని పోలీసులను ఆదేశించింది. కేసుకు సంబంధించిన అన్ని దస్త్రాలను బుధవారం ఉదయం 10 గంటల్లోపు సీబీఐకి అందజేయాలని పేర్కొంది. సెమినార్ హాల్‌లో జూనియర్ వైద్యురాలిపై అత్యంత పాశవిక దాడి జరుగుతుంటే ఆసుపత్రిలో ఉన్నవారికి ఆ విషయం తెలియకపోవడం, యాజమాన్యం ఆలస్యంగా స్పందించడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది.


ఈ కేసులో నిందితుడికి పోలీసులతో సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సాక్ష్యాలు తారుమారు చేయకుండా ఉండేందుకు స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని బాధితురాలి తల్లిదండ్రులు కోరినట్లుగా న్యాయస్థానం పేర్కొంది.

గతంలో జరిగిన ఓ కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పు ఆధారంగా న్యాయపరమైన దర్యాప్తు కోసం కేసును సీబీఐకి అప్పగిస్తున్నట్లు వెల్లడించింది. దేశవ్యాప్తంగా డాక్టర్లు చేపడుతున్న నిరసనలపై స్పందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడే పవిత్రమైన బాధ్యత వైద్యులపై ఉన్నందున.. ఆందోళనలను విరమించాలని సూచించింది. కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్‌పై కోర్టు తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఆయన రాజీనామా చేసిన వెంటనే మరొక పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించింది. ఆయన్ను వెంటనే విధుల నుంచి తొలగించి, సెలవుపై పంపాల్సిందిగా ఆదేశించింది.



## అండం ఇచ్చిన మహిళకు బిడ్డపై హక్కు లేదు

వివరాలు 2లో




## భార్యను బైక్‌కు కట్టేసి.. ఊరంతా లాక్కెళ్లాడు

వివరాలు 3లో



## సామాన్యులకు ఆయుష్మాన్ భారత్

వివరాలు 4లో



## 108 రోజులు.. భీమ్లానాయక్ హీరోయిన్ ఫిట్ నెస్ మంత్ర ఇదే..!

వివరాలు 5లో


## లంచగొండు అధికారులు తప్పించుకోలేరు

### ఏసిబి వలలో రంగారెడ్డి జేసీ భూపాల్‌రెడ్డి

ముందడుగు హైదరాబాద్:

రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) భూపాల్‌రెడ్డిని అవినీతి నిరోధక శాఖ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఆయనతో పాటు కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి కూడా పట్టుబడ్డారు. ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితా నుంచి భూమి తొలగింపునకు జాయింట్ కలెక్టర్ రూ.8 లక్షల లంచం డిమాండ్ చేశారు. మిగతా 2లో







## రామ్ దేవ్ బాబాకు సుప్రీంకోర్టులో ఊరట

### పతంజలి ధిక్కరణ కేసు మూసివేత

ముందడుగు జాతీయం:

ప్రకటనల వ్యవహారంలో తప్పదోవ పట్టించే పతంజలి ఆయుర్వేదకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ ప్రకటనలకు సంబంధించి యోగా గురువు, సంస్థ మిగతా 2లో

ముందడుగు
బుధవారం, 14-8-2024, హైదరాబాద్

## లంచగొండు అధికారులు తప్పించుకోలేరు

(మొదటిపేజీ తరువాయి)
డబ్బును సీనియర్ అసిస్టెంట్ ద్వారా జేసీ తీసుకున్నారు. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు దాడి చేసి జేసీ, సీనియర్ అసిస్టెంట్‌ను పట్టుకున్నారు. మరోవైపు నాగోల్‌లోని జేసీ భూపాల్‌రెడ్డి నివాసంలో ఏసీబీ అధికారుల సోదాలు చేపట్టారు. ఇంటిలో రూ.16లక్షల నగదు, కీలకపత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

**ఏసీబీ నుంచి తప్పించుకోలేరు.. సీవీ ఆనంద్**

లంచం తీసుకునే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏసీబీ నుంచి తప్పించుకోలేరని ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ అన్నారు. జాయింట్ కలెక్టర్, సీనియర్ అసిస్టెంట్లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. వీరిని పట్టుకోవడానికి ఏసీబీ బృందం సోమవారం రాత్రి ఎంతో చాకచక్యంగా పని చేసిందని కొనియాడారు.

## అండం ఇచ్చిన మహిళకు బిడ్డపై హక్కు లేదు

### బాంబే హైకోర్టు కీలక తీర్పు

ముందడుగు బొంబాయి:
అండం ఇచ్చిన మహిళకు పుట్టిన బిడ్డపై చట్టపరమైన హక్కు ఉండదని బాంబే హైకోర్టు వెల్లడించింది. పిల్లలకు వారు జీవసంబంధ తల్లిదండ్రులుగా చెప్పడం కుదరదని స్పష్టం చేసింది. తన కవల కుమార్తెలను చూసేందుకు ఓ మహిళకు అనుమతిస్తూ ఈ తీర్పు చెప్పింది. తన కవల పిల్లలు సరోగసీ ద్వారా జన్మించారని, వారు తన భర్త, సోదరితో ఉంటున్నారంటూ ఓ మహిళ కోర్టులో పిటిషన్ వేశారు. తన సోదరే అండం దానం చేసిందని, కానీ తన భర్త మాత్రం అండం దానం చేసిన మరదలికే పిల్లలపై చట్టపరమైన హక్కు ఉంటుందని వాదిస్తున్నారని



పేర్కొంది. ఆ వాదనను బాంబే హైకోర్టు తోసిపుచ్చింది. పిటిషనర్ సోదరిని జీవసంబంధ తల్లిగా చెప్పే హక్కు ఉండదని స్పష్టం చేసింది.
పిటిషనర్ సోదరి చేసిన అండ దానంతో సరోగసీ ద్వారా 2019లో కవలలు జన్మించారు. అదే సమయంలో పిటిషనర్ సోదరి కుటుంబం రోడ్డు ప్రమాదానికి గురైంది. దాంతో ఆమె కుమార్తె, భర్త మృతి చెందారు. 2019 నుంచి 2021 మార్చి వరకు ఇద్దరు పిల్లలతో కలిసి పిటిషనర్, ఆమె భర్త కలిసే ఉన్నారు. ఆ తరువాత వైవాహిక బంధంలో విభేదాల కారణంగా 2021లో భార్యకు చెప్పకుండా ఇద్దరు పిల్లలతో కలిసి భర్త వేరే ఇంటికి వెళ్లిపోయాడు. అక్కడ రోడ్డు ప్రమాదంతో కుంగుబాటుకు గురైన తన మరదలు.. పిల్లల బాగోగులను చూసుకునేందుకు తనతోనే ఉంటుందని పిటిషనర్ భర్త చెప్పడంతో పిటిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయడమే కాకుండా, స్థానిక కోర్టును ఆశ్రయించారు. కింది కోర్టు తన అభ్యర్థనను తిరస్కరించడంతో ఆమె హైకోర్టును ఆశ్రయించగా తాజా తీర్పు వెలువడింది.

## మంత్రి అతిశీకి జెండా ఎగరవేసే అవకాశం ఇవ్వం

- ఢిల్లీ హోంమంత్రి కైలాశ్ గహ్లోత్ ఓకే
- గవర్నర్ తెలిపినట్లు రాజ్‌భవన్ వర్గాలు వెల్లడి




ముందడుగు ఢిల్లీ:
ఢిల్లీ స్వాతంత్ర్య వేడుకల్లో తనకు బదులుగా తమ మంత్రి అతిశీ జాతీయజెండాను ఎగురవేస్తారని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గవర్నర్‌ను కోరిన సంగతి తెలిసిందే. ఆయన విజ్ఞప్తిని ఢిల్లీ సాధారణ పరిపాలనా విభాగం తిరస్కరించింది. ఆ అధికారాన్ని ఆమెకు ఇవ్వలేమని తేల్చి చెప్పింది. ఈ క్రమంలోనే జెండా ఆవిష్కరణకు ఢిల్లీ హోంమంత్రి కైలాశ్ గహ్లోత్ పేరును గవర్నర్ వీకే సక్సేనా నామినేట్ చేసినట్లు రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. "స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయజెండా ఎగురవేసే అధికారాన్ని ఢిల్లీ మంత్రి అతిశీకి ఇవ్వలేం. ఈ వేడుక నిర్వహించేందుకు నిర్దేశిత విధానం ఉంది. దాన్ని పాటించకుండా ఆమెకు ఆ బాధ్యత అప్పగిస్తే కార్యక్రమం పవిత్రత దెబ్బతింటుంది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని పరిపాలన విభాగం వివరించింది. జెండా ఎగురవేసేందుకు తనను అనుమతించకపోవడంపై మంత్రి అతిశీ స్పందించారు.

**హక్కును కాలరాస్తున్నారు..**

"ఢిల్లీలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వానికి జెండా ఎగురవేసే హక్కు ఉంటుంది. కానీ, ఆ హక్కును కాలరాసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. గవర్నర్ వీకే. సక్సేనా ఈ కార్యక్రమం నిర్వహించాలని చూస్తున్నారు" అని అతిశీ వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ స్థానంలో జెండా ఎగురవేసేందుకు మంత్రి కైలాశ్ గహ్లోత్ పేరును నామినేట్ చేసినట్లుగా తెలుస్తోంది.

## రామ్ దేవ్ బాబాకు సుప్రీంకోర్టులో ఊరట




(మొదటిపేజీ తరువాయి)
వ్యవస్థాపకులు రాందేవ్ బాబా, ఎండీ ఆచార్య బాలకృష్ణ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పిన సంగతి తెలిసిందే. ఇకపై అలాంటి యాడ్స్ ఇవ్వబోమని కోర్టుకు విన్నవించారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం.. వారిపై ధిక్కరణ కేసును మూసివేసింది. అయితే, తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది.

ఆధునిక వైద్యవిధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పతంజలిపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గతేడాది నవంబర్‌లో ఆ సంస్థను మందలించింది. దీంతో ఎలాంటి ఉల్లంఘనలూ జరగవంటూ అప్పట్లో సంస్థ తరఫున న్యాయవాది కోర్టుకు హామీ ఇచ్చారు. కానీ, వాటిని ఉల్లంఘించడంతో కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే వారిపై ధిక్కరణ చర్యలు చేపట్టింది.

## మహిళ రోగులతో డాక్టర్ అసభ్య ప్రవర్తన

### వైద్యుడిని చితకబాదిన రోగి బంధువులు



ముందడుగు ఒడిశా:
ఓ డాక్టర్ బాధ్యత మరిచి మహిళా రోగులతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. వారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఒడిశాలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కటక్‌లోని ఎస్‌సీబీ మెడికల్ కాలేజ్ అండ్ ఆసుపత్రికి ఇద్దరు మహిళలు చెకప్ కోసం వెళ్లారు. అక్కడ ఉన్న ఓ వైద్యుడు వారికి ఈసీజీ తీయాలంటూ లోనికి పిలిచాడు. ఈ ప్రక్రియ జరుగుతున్న సమయంలో ఒక మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. మరో మహిళతోనూ ఇలాగే ప్రవర్తించాడని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆగ్రహానికి గురైన బాధితుల బంధువులు వైద్యుడిపై దాడికి దిగారు. అంతా కలిసి అతడిని చావ బాదారు. దీని గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. తీవ్ర గాయాల పాలైన వైద్యుడిని అదే అస్పత్రిలో ఐసీయూలో చేర్చారు. ప్రస్తుతం అతడికి చికిత్స అందుతోంది. బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అనిల్ మిశ్రా తెలిపారు. బాధితులు సహా నిందితుడు చికిత్స పొందుతుండడంతో వారు కోలుకున్న అనంతరం వారి వాంగ్మూలం నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ముందడుగు
బుధవారం,
14-8-2024,
హైదరాబాద్

## బ్యాడ్మింటన్ ప్లేయర్ ప్రమోద్ భగత్‌పై
# 18 నెలల నిషేధం



ముందడుగు క్రీడలు:
బ్యాడ్మింటన్ ప్లేయర్ ప్రమోద్ భగత్‌పై 18 నెలల నిషేధం విధించినట్లు బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ ప్రకటించింది. టోక్యో 2020 పారా ఒలింపిక్ క్రీడల్లో స్వర్ణ పతకం గెలిచాడు. యాంటీ డోపింగ్ నియమావళిని ఉల్లంఘించినట్లు బీడబ్ల్యూఎఫ్ పేర్కొన్నది. 12 నెలల వ్యవధిలోనే షట్లర్ భగత్ మూడు సార్లు పరీక్షల్లో విఫలమైనట్లు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఆఫ్ స్పోర్ట్ తెలిపింది. దీంతో ప్రమోద్ భగత్.. పారిస్ 2024 పారాఒలింపిక్ గేమ్స్‌కు దూరంకానున్నాడు. భగత్ చేసిన అప్పీల్‌ను సీఏఎస్ అప్పీల్స్ డివిజన్ జూలై 29వ తేదీన రద్దు చేసింది. అనర్హత వేటు తక్షణమే అమలులోకి వస్తుందని సీఏఎస్ తెలిపింది.

ఇటీవల థాయ్‌ల్యాండ్‌లో జరిగిన పారా బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో ఎస్ఎల్3 టైటిల్‌ను ప్రమోద్ భగత్ నిలబెట్టుకున్నాడు. ఫైనల్లో అతను ఇంగ్లండ్‌కు చెందిన డానియల్ బేతల్‌ను ఓడించాడు.35 ఏళ్ల భగత్ 14-21, 21-15, 21-15 స్కోరుతో డానియల్‌పై గెలిచాడు. సింగిల్స్‌లో నాలుగుసార్లు ప్రపంచ టైటిళ్లు అతను సొంతం చేసుకున్నాడు. 2015, 2019, 2022 సంవత్సరాల్లో ఆ టైటిల్స్ అతను గెలిచాడు.

# భార్యను బైక్‌కు కట్టేసి.. ఊరంతా లాక్కెళ్లాడు
## మద్యం మత్తులో భర్త అమానుషం



ముందడుగు రాజస్థాన్:
ఒక వ్యక్తి పూటుగా మద్యం తాగి ఆ మద్యం మత్తులో భార్యను బైక్‌కు కట్టేసి.. ఊరంతా లాక్కెళ్లిన ఘటన రాజస్థాన్‌లో జరిగింది. నగౌర్ జిల్లాలో జరిగిన ఈ ఘటనకు చెందిన వీడియో ఒకటి వైరల్ అవుతున్నది. దీంతో ఆ వ్యక్తిని అరెస్టు చేశారు. నార్సింగపూర్ గ్రామంలో నెల రోజుల క్రితం ఈ ఘటన జరిగినట్లు పాంచౌడి పోలీసు స్టేషన్ ఎస్ఐ సురేంద్ర కుమార్ తెలిపారు. బైక్‌కు భార్య కట్టడానికి ముందు ఆమెను భర్త తీవ్రంగా కొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. బైక్‌తో కట్టేసిన తర్వాత ఆమెను లాక్కెళ్లాడు. వీడియో ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆ మహిళ బంధువుల వద్ద ఉంటోంది. ఈ విషయాన్ని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. నిందితుడు మేఘవాల్ తాగుబోతు అని, ఎప్పుడూ భార్యను కొట్టేవాడని సాక్ష్యులు తెలిపారు. ఎవరితోనూ ఆమె మాట్లాడనివ్వకుండా చేసేవాడని గ్రామస్థులు చెప్పారు.

## డేరా బాబాకు మరోసారి
# తాత్కాలిక బెయిల్
## ఆశ్రమంలో బస చేస్తారని సమాచారం



ముందడుగు జాతీయం:
'డేరా సచ్చా సౌదా' చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ అలియాస్ డేరా బాబా ఇద్దరు మహిళలపై లైంగికదాడికి పాల్పడ్డాడన్న కేసులో దోషిగా ఉన్నాడు. అయితే డేరా బాబా మరోసారి జైలు నుంచి బయటకు వచ్చారు. 21 రోజుల పాటు తాత్కాలిక బెయిల్ లభించడంతో ఆయన మంగళవారం ఉదయం 6:30 గంటలకు జైలు నుంచి విడుదలైనట్లు అధికారులు తెలిపారు. ఈ 21 రోజులూ గుర్మీత్ రామ్ సింగ్ ఉత్తరప్రదేశ్‌లోని బర్నావాలో ఉన్న డేరా ఆశ్రమంలో బస చేస్తారని ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. కాగా దేరాబాబా విడుదలను వ్యతిరేకిస్తూ శిరోమణి గురుద్వారా పర్బంధక్ కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను పంజాబ్-హర్యానా హైకోర్టు ఇటీవలే కొట్టివేసిన విషయం తెలిసిందే. ఆ పరిణామం జరిగిన రోజుల వ్యవధిలోనే ఆయనకు తాత్కాలిక బెయిల్ లభించడం గమనార్హం.

## నర్సంపేట ఉప్పలయ్య
# హోటల్‌కు అవార్డు
### ఇంటి భోజనానికి భారత ప్రభుత్వ గుర్తింపు




ముందడుగు వరంగల్:
తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా నర్సంపేట నడిబొడ్డున ఉప్పలయ్య అనే వ్యక్తి 30 ఏండ్ల నుంచి నడిపించిన హోటల్‌కు ఇప్పుడు భారత ప్రభుత్వ గుర్తింపు లభించింది. అక్కడ దొరికేది రుచికరమైన, నాణ్యమైన ఇంటి భోజనం. తక్కువ ధరలకే లాభాపేక్ష లేకుండా అందిస్తున్నారు. ఇల్లే హోటల్‌గా నడిపిస్తున్నారు. ఈ హోటల్‌కు భారత ప్రభుత్వం (మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్) నుంచి రీజినల్ హెడ్ ఆఫీసు హైదరాబాద్ ద్వారా అవార్డు వచ్చింది. సభ్యులు రెండు నెలల కిందట ఈ హోటల్‌లో భోజనం చేసి బాగుందని చెప్పి వెళ్లారు. సోమవారం వారు మళ్లీ వచ్చి హోటల్‌లో ఇదే నాణ్యత కొనసాగించాలంటూ అవార్డును అందించారు. ఉప్పలయ్య మరణానంతరం అదే హోటల్‌ను ఆయన కుమారుడు శ్రీనివాస్ నడిపిస్తున్నారు. హోటల్‌లో కుటుంబ సభ్యులు మొత్తం వర్కర్లుగా ఉండి సొంతంగా వంటలు చేస్తారు. ఇక్కడ రోజూ 150 నుంచి 200 మంది భోజనం చేస్తున్నారు. సాదా భోజనానికి రూ.90 తీసుకుంటున్నారు. వెజ్, నాన్‌వెజ్ కూడా ఉంటుంది.

## బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం



ముందడుగు శ్రీశైలం:
లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానంలో మంగళవారం సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను జరిపించనున్నది. ప్రతీ మంగళవారం మరియు అమావాస్య రోజులలో బయలువీరభద్రస్వామివారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహించ బడుతున్నాయి.బయలు వీరభద్రస్వామివారు శివభక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ప్రారంభంలో ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు. సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి.ఈ పూజాదికాలలో పంచామృతాలతోనూ, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్దజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.

# గంటలో కేసు ఛేదించిన పోలీసులు

## టెక్నాలజీ సహాయంతో మనిషి ప్రాణాన్ని కాపాడారు




ముందడుగు హైదరాబాద్:
టెక్నాలజీ సాయంతో గంట వ్యవధిలోనే పోలీసులు కేసును ఛేదించారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీరప్పనగర్‌కు చెందిన మాలంపాక బాబీ (28) ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం డ్యూటీకి వెళ్తున్నానంటూ ఇంటి నుంచి బయటకు వచ్చాడు. అనంతరం తన బావమరిదికి ఫోన్ చేశాడు. తాను చనిపోతున్నానంటూ చెప్పి ఫోన్ స్విచాఫ్ చేశాడు. కుటుంబసభ్యులు ఆయనకు తెలిసిన వారిని సంప్రదించినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్.. బాబీ మొబైల్ సిగ్నల్స్‌ను ట్రేస్ చేశారు. సికింద్రాబాద్‌లోని మహంకాళి ఏరియాలో ఉన్నట్లు గుర్తించి వెంటనే సిబ్బందిని అక్కడికి పంపించారు. ఓ లాడ్జిలో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లగా అప్పటికే బాబీ దోమల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గమనించారు. వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించడంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం అతడిని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి టెక్నాలజీ సహకారంతో నిండు ప్రాణం కాపాడటంలో చాకచక్యంగా వ్యవహరించిన జగద్గిరిగుట్ట సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు, సీఐ క్రాంతి కుమార్ అభినందించారు.

# బిటెక్ పాసైతే రైల్వేలో ఉద్యోగాలు

- భారీ జాబ్ నోటిఫికేషన్ విడుదల
- ఆగస్టు 29 వరకు దరఖాస్తు



ముందడుగు విద్య:
కేంద్ర రైల్వే నుంచి భారీ జాబ్ నోటిఫికేషన్ విడుదలైంది. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ జూనియర్ ఇంజనీర్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ప్రారంభించింది. డిప్లొమా, ఇంజినీరింగ్ డిగ్రీ, బీఎస్సీ పూర్తిచేసిన యువతకు ఇదో సువర్ణావకాశం. ఈ ప్రకటన ద్వారా 7,951 జూనియర్ ఇంజినీర్, కెమికల్ సూపర్‌వైజర్ ఖాళీలు భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ జులై 30న ప్రారంభమైంది. ఆగస్టు 29 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అర్హత ఉన్నవారు తమ పరిధిలోని రైల్వే జోన్ అధికారిక పోర్టల్ విజిట్ చేసి దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ గురించిన పూర్తి సమాచారం ఇప్పుడు చూద్దాం. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ లేదా టెలికమ్యూనికేషన్ విభాగాల్లో ఇంజనీరింగ్ చదివిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. దరఖాస్తుదారుల వయసు 18 నుంచి 36 ఏళ్లలోపు ఉండాలి. ఆన్ లైన్ విధానంలో అప్లై చేసుకోవాలి. జనరల్, ఓబీసీ అభ్యర్థులు రూ. 500 అప్లికేషన్ ఫీజు చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులు రూ. 250 పేమెంట్ చేయాలి.






# సామాన్యులకు ఆయుష్మాన్ భారత్

- రూ.5 లక్షల వరకు వైద్యానికి ఆర్థిక సాయం
- ఆయుష్మాన్ భారత్ గురించి పూర్తి వివరాలు

ముందడుగు ప్రత్యేకం:
సామాన్య ప్రజల ఆరోగ్య కోసం భారత ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ యోజన లేదా ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ద్వారా సామాన్య ప్రజలకు హెల్త్ ఇన్సూరెన్స్ అందిస్తుంది. ఆర్థికంగా వెనకబడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ స్కీమ్ కింద కేంద్రం, ఏటా ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల వరకు వైద్యం కోసం ఆర్థిక సాయం అందిస్తుంది.

### అతి పెద్ద పథకం..

పిఎంజెఎవై స్కీమ్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య పథకం. 2008లో జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకంగా ఉన్న స్కీమ్‌ను, ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం 2018లో ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై)గా మార్చింది. ఈ పథకానికి నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూరుస్తాయి.

### కావలసిన డాక్యుమెంట్లు..

ఆయుష్మాన్ కార్డు ఉన్నవారు ఉచితంగా చికిత్స పొందవచ్చు. ఇందుకు కొన్ని కీలక డాక్యుమెంట్లు అవసరం. దరఖాస్తుదారుకి రేషన్ కార్డ్, నివాస ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డ్, యాక్టివ్‌గా ఉన్న మొబైల్ నంబర్ అవసరం. ఆదాయ ధృవీకరణ పత్రం (గరిష్ట వార్షిక ఆదాయం సంవత్సరానికి రూ. 5 లక్షల వరకు మాత్రమే) ఉండాలి.

### దరఖాస్తు విధానం

అర్హత ఉన్న ఎవరైనా ఆయుష్మాన్ భారత్ స్కీమ్ కోసం రెండు మార్గాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. సమీపంలోని సిఎస్ సి లేదా ఎంపానెల్డ్ ఆసుపత్రిని సంప్రదించవచ్చు. ఆయుష్మాన్ భారత్ స్కీమ్‌కి రిజిస్టర్ చేసుకోవడానికి అవసరమైన అన్ని డాక్యుమెంట్లు తీసుకెళ్లండి.

### మీకు అర్హత ఉందా?

మీరు పిఎంజెఏవై పథకం లబ్ధి పొందడానికి అర్హులో కాదో ఇలా తెలుసుకోవచ్చు. ముందుగా పిఎంజెఏవై పథకం అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్‌ను సందర్శించండి. హోమ్ పేజీలో 'యామ్ ఐ ఎలిజిబుల్' అనే ట్యాబ్‌పై క్లిక్ చేయండి. తర్వాత మీ మొబైల్ నంబర్, క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి, 'జనరేట్ ఓటీపీ' బటన్‌పై క్లిక్ చేయండి. ఇప్పుడు మీ రాష్ట్రం, మీ పేరు, రేషన్ కార్డ్ నంబర్, ఇంటి నంబర్ లేదా మొబైల్ నంబర్ రిజిస్టర్ చేయండి. మీ కుటుంబం ఆయుష్మాన్ భారత్ యోజన పరిధిలో ఉంటే రిజల్ట్స్‌లో మీ పేరు కనిపిస్తుంది.

### చికిత్స ఎలా పొందుతారు?

మీరు ఈ పథకానికి అర్హులై, మీరు కార్డు అందుకుంటే, మీరు రూ.ఐదు లక్షల వరకు ఉచితంగా చికిత్స పొందవచ్చు. ఈ పథకం కింద అందుకున్న కార్డు చూపించి ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవచ్చు.

ముందడుగు
బుధవారం, 14-8-2024, హైదరాబాద్

## హిమాన్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్

# కార్యాలయం ప్రారంభం


### అతిథులుగా హాజరైన రితేష్ దేశ్‌ముఖ్, జెనీలియా



ముందడుగు హైదరాబాద్: ప్రముఖ ప్రొడక్షన్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ కంపెనీ హిమాన్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ నగరంలో మంగళవారం తన కొత్త ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించింది. ఈ కార్యాలయాన్ని బాలీవుడ్ నటులు, దంపతులు రితేష్ దేశ్‌ముఖ్, జెనీలియాతో పాటు హిమాన్ష్ గ్రూప్ ఎండీ సంజీవ్ పూరి ప్రారంభించారు. ఈ కొత్త కార్యాలయం ప్రకటనలకు సంబంధించిన షూట్‌లు, భారీ-బడ్జెట్ సినిమా నిర్మాణాలు, దర్శకత్వం మరియు ఇతర లేబుల్ సంబంధిత కార్యకలాపాలతో సహా వివిధ కార్యకలాపాలకు సంస్థ యొక్క కేంద్ర కేంద్రంగా పనిచేస్తుంది.


"మా కొత్త ప్రధాన కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించడం పట్ల మేము సంతోషిస్తున్నాము. ఇది మా విస్తరణ కార్యకలాపాలకు నాడీ కేంద్రంగా ఉపయోగపడుతుంది" అని హిమాన్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు హిమాన్ష్ దేవ్‌కేట్ అన్నారు. పరిశ్రమలో మరియు మా ప్రేక్షకులకు అసాధారణమైన వినోద అనుభవాలను అందిస్తామన్నారు

# ఆ క్యారెక్టర్ వద్దనుకున్నా!



ప్రభాస్ హీరోగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన 'కల్కి 2898 ఏడీ' బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లతో జాతీయస్థాయిలో రికార్డులు సృష్టించిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో పలువురు అగ్ర తారలు అతిథి పాత్రల్లో కనిపించి అభిమానుల్ని అలరించారు. కథానాయిక కీర్తిసురేష్‌కు సైతం 'కల్కి'లో ఓ పాత్రను పోషించే అవకాశం వచ్చిందట. అయితే అనివార్యకారణాల వల్ల ఆ ఆఫర్‌ను తిరస్కరించిందట. ఈ విషయాన్ని కీర్తి సురేష్ ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్‌పై ఉన్న గౌరవం, దర్శకుడు నాగ్‌అశ్విన్ పట్ల ఉన్న అభిమానంతో ఎలాగైనా ఈ ప్రెస్టేజియస్ ప్రాజెక్ట్‌లో భాగం కావాలని కోరుకుందట.

దాంతో సినిమాలో ప్రభాస్ ఉపయోగించిన కారు బుజ్జికి వాయిస్ ఓవర్ అందించే అవకాశాన్ని కీర్తి సురేష్‌కు ఇచ్చారు. బుజ్జి పాత్రకు కీర్తి సురేష్ చెప్పిన తెలుగు డబ్బింగ్ అందరిని ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ భామ నటించిన తమిళ చిత్రం 'రఘు తాత' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది.



## 108 రోజులు.. భీమ్లానాయక్ హీరోయిన్

# ఫిట్ నెస్ మంత్ర ఇదే..!

భీమ్లానాయక్ సినిమాతో తెలుగులో ఎంట్రీలోనే మంచి బ్రేక్ అందుకుంది మలయాళ భామ సంయుక్తా మీనన్. ఆ తర్వాత బింబిసార, సార్ చిత్రాలతో హిట్స్‌ను ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం నిఖిల్‌తో కలిసి స్వయంభు సినిమాలో నటిస్తోంది సంయుక్తామీనన్. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ భామ తాజాగా ఆసక్తికర విషయం ఒకటి ఫొటో రూపంలో షేర్ చేసుకుంది. గ్లామర్ ప్రపంచం అంటే చక్కటి శరీర సౌష్ఠవాన్ని మెయింటైన్ చేయాల్సి ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇక నాజూకుగా కనిపించేలా సైజ్ జీరో ప్యాక్ కొనసాగించాలంటే చాలా శ్రమించాల్సి ఉంటుంది. అలాంటి వర్కవుట్ సెషనే పెట్టుకుంది. ఏకంగా ఈ భామ తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు 108 రోజుల ప్రణాళిక వేసుకుంది. ఫిట్ నెస్ సెషన్ పూర్తయిన తర్వాత తన బాడీ ఫిజిక్‌ను చెక్ చేసుకుంటున్న స్టిల్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది సంయుక్తామీనన్. ఫిట్‌నెస్ మంత్రలో తనకు సహకరించిన ఫిట్‌నెస్ ట్రైనర్లు సుప్రియ, అరుణ్‌కు ధన్యవాదాలు తెలియజేసింది. పవన్ కల్యాణ్ హీరోయిన్ అప్‌కమింగ్ హీరోయిన్లకు గట్టిపోటీనిచ్చేలా తనను తాను మేకోవర్ చేసుకుని టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తూ.. చాలా మందికి స్ఫూర్తిగా నిలుస్తోందంటున్నారు సినీ జనాలు.